


డబ్బుతోపాటు సంతృప్తినీ ఇచ్చే పని దొరికితే అంతకన్నా గొప్ప అవకాశం లేదు. లేకపోతే చుట్టూ సౌకర్యాలుంటాయి. కానీ, మనసులో సంతోషాలుండవు. డబ్బునీ, సంతోషాన్నీ ఇచ్చే కొలువు ఎక్కడుంటుందని వెదికితే దొరకదు. ఇష్టమైన పనిని ఎంచుకుంటే వరించే అదృష్టం అది! ఆ అదృష్టం పట్టాలంటే పెద్ద గోల్ కొట్టాల్సిన పనిలేదు. ఎవరు ఏ పనికి సూటవుతారో తెలుసుకునే అవకాశం కల్పించే 'వాట్ ఈజ్ మై గోల్'తో జతకడితే చాలు!

# వాట్ ఈజ్ మై గోల్?

కోటి విద్యలు కూటి కోసమే అన్నారు. కోటి విద్యల సంగతి ఎవడెరుగు? అయిదంకెల జీతాలిచ్చే సాఫ్ట్‌వేర్ కొలువు మాత్రం తెలుగువాళ్లకు బాగా ఇష్టం. మన దేశంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కంటే ఎక్కువ జీతం, సంతోషాన్నిచ్చే ఉద్యోగాలు 255కి పైగా ఉన్నాయి. కానీ, అవేవీ మన ఆలోచనల్లోకి రావు. ఇప్పుడు చేస్తున్న ఉద్యోగాలు వదిలిపెట్టి కొత్త ఉద్యోగాల్లో చేరడానికి చదువు, అనుభవం అడ్డంకి. మబ్బుల్ని చూసి కుండలో నీళ్లు పారబోసుకోకుండా చేరిన ఉద్యోగంలోనే జీవితం నెట్టుకుపోవాల్సిందే. ఇలాంటి సమస్య రాకుండా ఉండాలంటే పాఠశాలల్లోనే అన్ని రంగాల్లోని అవకాశాల గురించి తెలుసుకునే అవకాశం ఉండాలి అంటారు చిత్రాలి శర్మ. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ పూర్తి చేసిన ఆమె సంతృప్తి లేక రకరకాల ఉద్యోగాల్లో చేరింది. మానేసింది. ఆ ఉద్యోగ జీవితంలో ఆనందం లేక తనలాగే మానేసేవాళ్లతో కలిసి 'వాట్ ఈజ్ మై గోల్' స్టార్టప్‌ని స్టార్ట్ చేసింది. కేవలం అవకాశాల గురించి తెలుసుకోవడమే కాదు. ఆ రంగంలో అనుభవం కూడా ఉంటే సరైన ఉద్యోగాన్ని ఎంపిక చేసుకోవచ్చని చిత్రాలి వాట్ ఈజ్ మై గోల్ స్టార్టప్ ఇప్పటికే 102 పాఠశాలలతో అవగాహన కుదుర్చుకుంది. ఆ పాఠశాలల్లోని విద్యార్థులకు ఏఏ రంగాల్లో ఎలాంటి అవకాశాలున్నాయో వివరిస్తున్నది. పాఠాలు మాత్రమే కాదు... ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి క్షేత్రస్థాయికి కూడా తీసుకుపోతుంది.



## ప్రాక్టికల్ లైఫ్

'మీరేమవ్వాలనుకుంటున్నారు?' అని పిల్లల్ని అడిగితే.. క్రికెటర్ అనేవాళ్లు చాలామంది ఉంటారు! క్రికెటర్లకు ఉండే ఫాలోయింగ్ పిల్లలతో ఆ మాట చెప్పిస్తుంది. క్రీజులో ఉన్నంత క్రేజీగా ఉండదు క్రికెటర్ జీవితం. సాధనంత కఠోరంగా ఉంటుంది. ఆ కష్టం కంటే గ్యాలరీలో కూర్చుని కేరింతలు కొట్టిందే హాయి అనుకుంటారు. తారల జీవితం తెరమీద కనిపించినంత గొప్పగా ఉంటుందని పిల్లలు అనుకుంటారు. వాట్ ఈజ్ మై గోల్.. సినిమా కలలుకనే పిల్లల్ని రామానాయడు స్టూడియోకి తీసుకుపోయింది. సినిమా కెరీర్‌ని వాళ్లకు అర్థం చేయించడం కోసం ఫిల్మ్ స్కూల్‌లో డైరెక్షన్ గురించి చెప్పే లెక్చరర్‌తో ఒక సెషన్ నిర్వహించింది. తర్వాత స్క్రిప్ట్ రైటర్స్, ఎడిటర్స్ కూడా వాళ్ల బాధ్యతల గురించి చెప్పారు. తర్వాత ఎడిటింగ్ రూమ్‌కి పోయి ఎడిటింగ్ ఎలా చేస్తున్నారు చూసి నేర్చుకున్నారు. డబ్బింగ్ రూమ్‌లో ఒక రోజు కూర్చున్నారు. ఇలా 24 క్రాఫ్ట్స్ గురించి తెలుసుకున్న తర్వాత ఆ పిల్లలు ఎనిమిది బ్యాచ్‌లుగా విడిపోయారు. స్క్రిప్ట్ రాసుకున్నారు. స్క్రీన్ ప్లే రాసుకున్నారు. పెద్దలతో చర్చించి ప్రతి బ్యాచ్ ఒక షార్ట్ ఫిల్మ్ తీసింది. సినిమా జీవితం ఎలా ఉంటుందో